# ముఖ పరీక్ష

ఆ కార్యాలయంలో నిరీక్షణ చేసే వారికి కూర్చునేందుకు వేరే సదుపాయాలు లేవు. ఎందుకులేవూ అంటే, ఆ కార్యాలయాన్ని గురించి అటు ప్రభుత్వానికీ, యిటు ప్రజలకీ శ్రద్ధాసక్తులు లేకపోవడమే! అయితే ఆ రోజు ఆ అవసరం చాలా పెద్ద ఎత్తుగా వచ్చిపడింది. కార్యాలయం అవరణలో ఓ షామియానా వేశారు. దాని కింద ఓ వంద కుర్చీలకు పైగా వేశారు. ముఖ పరీక్ష కోసం వచ్చిన యువతీ యువకులు, మధ్యమధ్యలో జనరల్ నాలెడ్జి గైడ్లు తిరగవేస్తూ, ఓ క్షణం చెదిరిన గుండె ధైర్యంతో, మరుక్షణం చిగురించే ఆశాభావంతో, లోపలికి వెళ్ళే పిలుపు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు.

"ఎస్.కె. అనూహ్య..... ఎస్.కె. అనూహ్య....." అటెండరు వరండాలోకి వచ్చి, ఎలుగెత్తి అరిచాడు. తడబడుతున్న అడుగులతో వరండా మెట్లెక్కి లోపలికి వెళ్ళింది. పది నిముషాల తర్వాత చెవి నుండి చెవి దాకా నోరు సాగదీసి, విజయసూచికలు ముఖం నిండా అలుముకొని బయటకు వచ్చింది. ఆమెని చూసి అభ్యర్థులు 'ఫర్వాలేదు, ప్రశ్నలు సులువుగానే ఉండుంటాయ్', అనుకొంటూ ఒక్క నిశ్వాసం విడిచారు.

"ఆర్. పరిగ్రాహ్... ఆర్. పరిగ్రాహ్..." అటెండరు అరుపు విని, పరిగ్రాహ్ లోపలికి పరుగెత్తినంత పనిచేశాడు. ఈ లోపుగా 'ఏమడిగారూ?' అంటూ అనూహ్య చుట్టూ చాలామంది గుమిగూడారు.

"గజనీ మహ్మద్ భారతదేశం మీద ఎన్నిసార్లు దండెత్తాడు? వీరప్పన్ ఎవరు? అప్పటి బాజ్‌పాయ్ ప్రభుత్వంలో రక్షణ మంత్రి ఎవరు?..." అనూహ్య అడిగిన ప్రశ్నలు కొన్ని చెప్పింది.

"అప్పటి 'భాజపా' ప్రభుత్వంలో రక్షణమంత్రి ఎవరబ్బా?" షామియానాలో ఓ చిన్న అలజడి.

"ఈ గైడ్‌లో ఆ వివరాలు లేవు!" ఎవరో అరిచారు.

"ఏమండీ, ఈ ప్రశ్నకు మీరు సమాధానం చెప్పారా?" అనూహ్య నెవరో అడిగారు.

"చెప్పాను. మీకందరికీ అడిగిన ప్రశ్నలు కొన్ని చెప్పాను. వాటిలో మీకు ఈ ప్రశ్నకి తప్ప, మిగిలిన వాటికి సమాధానాలు తెలుసునని అర్థమవుతోంది. అందుచేత ఆ ప్రశ్నకి జవాబు మీకు చెప్పదల్చుకోలేదు. అంటే నాకు మీ అందరికన్నా ఓ ప్లస్ మార్కు కావచ్చు. ఇకపోతే మిగిలిన ప్రశ్నలు మీకింక చెప్పదల్చుకోలేదు! ఎందుకంటే, వాటిలో కొన్నింటికి సమాధానం

చెప్పలేకపోయాను. మీరు గైడ్‌లు చూసి వాటికి సమాధానాలు తెలుసుకొంటే, ఒకవేళ మిమ్మల్ని కూడా అవే ప్రశ్నలడిగితే మీరు నా కన్నా ప్లస్ మార్కులు తెచ్చుకోవచ్చు! బెస్ట్ ఆఫ్ లక్ టు ఆల్ ఆఫ్, యూ! వస్తా!" అనూహ్య అందరి మీదా ఓ 'మనో వైజ్ఞానిక దబాస్' అంటే మానసికమైన ఒత్తిడి కలిగించి, విలాసంగా నడుచుకొంటూ వెళ్ళిపోయింది.

అభ్యర్థులు లోపలికి వెడుతున్నారు. వస్తున్నారు. బయటకు వచ్చి కొందరు అలజడి రేపే ప్రశ్నలు వివరాలు చెబుతున్నారు. గైడు పుస్తకాల్లో పేజీలు టపటపా తిరుగుతున్నాయి.

"కె.సంపత్..... కె.సంపత్"

సంపత్ ఓసారి టక్ సరిచేసుకుని, యోగ్యతా పత్రాల కవర్ని జాగ్రత్తగా పట్టుకొని, వరండా మెట్లెక్కి, లోపలికి ప్రవేశించాడు.

"కూర్చోండి, మీ పేరు?..." అధికారి ప్రశ్నించాడు వివరాల కాయితాల్లోకి చూస్తూ.

"కె. సంపత్," వినయంగా సమాధానం చెప్పాడు.

"ఈ బల్ల మీద నా కుడిచేతి వైపు మీకేం కనిపిస్తున్నాయ్?" అధికారి ప్రశ్నించాడు.

సంపత్ కొద్దిగా ఆశ్చర్యపోతూ, "కవర్ల దొంతర్లు!" అన్నాడు.

"అవన్నీ ఎమ్.ఎల్.ఏ.లూ, మినిస్టర్లూ, జిల్లా పరిషత్ ఛైర్మన్లూ, కలెక్టర్లూ, పారిశ్రామికవేత్తలూ పంపిన సిఫారసు ఉత్తరాలు. అందులో మీ గురించి కూడా రెండు సిఫారసు ఉత్తరాలున్నాయి. మూడూ నాలుగూ కూడా ఉన్న అభ్యర్థులున్నారు! మీరు నా పరిస్థితిలో ఉంటే ఏం చేస్తారు?"

సంపత్ కాని, మరెవరైనా కాని సభ్యత కోసం చెప్పే సమాధానం ఒక్కటే.

"వాటిని అలానే ఉంచడం మంచిదనుకొంటాను" అన్నాడు సంపత్ నెమ్మదిగా.

"గుడ్! అంటే, ఇలా రికమండేషన్ లెటర్స్ తీసుకురావడం, లేదా ఏర్పాటు చేసుకోవడం మంచిది కాదని ఒప్పుకొంటున్నట్లే కదా?!'

'ఈయనెవడో ఉద్దండపిండంలా ఉన్నాడు, ముందర కాళ్ళకి బంధం వేసి మరీ మాట్లాడుతున్నాడు!' అనుకొంటూ, "తప్పేనండి", అన్నాడు వేరు గత్యంతరం లేక.

"భేష్! రికమండేషన్ల మాట మరిచి ప్రస్తుతానికి వద్దాం. కొన్ని ప్రశ్నలడుగుతాను. ధైర్యంగా సమాధానాలు చెప్పండి. సరేనా?" – సంపత్‌లో కొంత ఆత్మవిశ్వాసం కలిగించే ధోరణిలో అన్నాడు అధికారి.

"మీరు మీ తల్లిదండ్రులకెన్నో సంతానం?"

"నాలుగోవాణ్ణి"

"మొత్తం మీరెంతమంది?"

"తొమ్మండుగురం. అయిదుగురక్క చెల్లెళ్ళు, నలుగురన్నదమ్ములం"

"మీ నాన్నగారి ఉద్యోగం?"

"సెకండరీ గ్రేడు టీచరు."

"ఇంకా సర్వీసులో ఉన్నారా?"

"ఇంకో మూడేళ్ళలో రిటైర్ అవుతారు"

"అంటే ఆయన వయసు 55 అన్నమాట. ఆయనకే వయసులో వివాహమైందో మీకు తెలుసా?"

"ఆయన ఇరవయ్యో ఏటననుకొంటాను"

"మీ అందరిలో ఆఖరి వారెవరు, వయసెంత?"

"ఆఖరిది చెల్లాయండి. వయసు నాలుగు సంవత్సరాలు."

"అంటే ఇరవై సంవత్సరాల వయసు నుండి ఏభై ఒకటో సంవత్సరం వరకూ, అంటే ముప్ఫై ఒక్క సంవత్సరాల కాలంలో తొమ్మండుగురు సంతానాన్ని కన్నారన్న మాట!"

సంపత్‌కి, అధికారి తన తల్లిదండ్రుల్ని హేళన చేస్తున్నాడేమోననిపించింది. కాని ఆయన ఉన్నమాటే అన్నాడు. అందుకని మౌనంగానే ఉండిపోయాడు.

"సరే, మీరు నాలుగోవాడినన్నారు. మీపై వాళ్ళ వివరాలు చెప్పండి".

"మా పెద్దన్నయ్య తాలూకా ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తున్నాడు."

"ఏం చదివాడు? పెళ్ళయిందా? అయితే ఎంతమంది పిల్లలు?"

"ఇంటర్ చదివాడండి. యిద్దరు పిల్లలు"

"తర్వాత?"

"అక్కయ్యండి. పదో క్లాసుతో చదువు ఆపేసిందండి. పెళ్ళయిందండి. ముగ్గురు పిల్లలు. బావగారు ఎలక్ట్రిసిటీ ఆఫీసులో లైన్‌మన్‌గా పన్జేస్తున్నాడు. తర్వాత రెండో అన్నయ్య. ఎస్.ఎస్.ఎల్.సి. చదివిన తర్వాత, మేజిస్ట్రేటు కోర్టులో డవాలీ బంట్రోతుగా పన్జేస్తున్నాడు. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఆ తర్వాత నేను. అతి కష్టం మీద పట్నంలో వారాలు చేసుకొని, చిన్న స్కాలర్‌షిప్‌తో బి.ఏ. పాసయ్యాను. తర్వాత చెల్లెలు, తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్ళు. ఏదో కష్టం మీద చదువులు సాగిస్తున్నారు."

"కుటుంబం ఎలా నడుస్తోంది?"

"ఇద్దరన్నలూ, నాన్నగారూ ఏదో బండి లాగించేస్తున్నారు. నాన్నగారు ప్రైవేట్లు కూడా చెబ్తారు."

"మూడేళ్ళ తర్వాత? మీ నాన్నగారు రిటైర్ అయిన తర్వాత, మీ అన్నలూ, నువ్వూ మీ స్వార్థం చూసుకొంటే? అలా చూసుకొన్నా ఈ కాల పరిస్థితులని బట్టి తప్పులేదు కూడాను! ఏమంటావు?"

అధికారి తన్ను ఇంటర్వ్యూ చేస్తున్నాడో, శల్యాలతో బాధిస్తున్నాడో, అర్థం కాలేదు సంపత్‌కి. మళ్ళీ మౌనంగానే ఉండిపోయాడు.

"మీ నాన్నగారికింకా సంతానం తాలూకు బాధ్యతలు వదల్లేదు. నిత్యం గడవాలి. చదువులు చెప్పించాలి. ఇంకా నలుగురాడపిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యాలి. ఏం చూసుకొని ధైర్యం? ఆస్తులున్నాయనుకోను. ఉంటే మీ అన్నలిద్దరూ పెద్ద చదువులు చదివేవారు! సరే కుటుంబ నియంత్రణ గురించి మీ అభిప్రాయమేమిటి?"

సమాధానం ఆయనే ముందుగా చెప్పి, తర్వాత ప్రశ్న అడుగుతున్నాడు. సంపత్‌కి మొదటిసారిగా తల కొట్టినంత పనైంది. అయినా కాస్త నిభాయించుకుని అన్నాడు.

"పరిమితమైన కుటుంబం లేకపోవడం మూలాన వచ్చే కష్టాలు మీరే ఎత్తిచూపారు. నా చేత చెప్పించారు. ఇంక నేను చెప్పగలిగింది ఏమీ లేదు."

"కుటుంబ నియంత్రణ గురించి మన దేశంలో శాస్త్రపరమైన అవగాహన ఎప్పుడు

మొదలైందంటారు?"

"ఏభై ఏళ్ళకి పైనే అయ్యుండొచ్చు"

"అంటే, మీ నాన్నగారికి విషయ పరిగ్రహణకి అవకాశం ఉందనే అనుకోవాలి. 'సమరం' సాహిత్యం బహుళ ప్రాచుర్యం చెందిన ఈ రోజుల్లో, కనీసం మీ యిద్దరన్నలూ, బావగారూ ఈ విషయమై ఆలోచించి ఉండాలే?! అవునూ, కుటుంబ నియంత్రణమై, వాళ్ళ అభిప్రాయం మీకేమైనా తెలుసా?"

"వాళ్లకింకా.." సంపత్ మధ్యలో ఆపేశాడు.

"వాళ్ళకింకా బుద్ధి రాలేదనడం సమంజసం. గజనీ మహ్మద్ గురించి, తాజ్‌మహల్ని గురించి ప్రశ్నలడగకుండా, మిమ్మి ధోరణిలో ప్రశ్నలడగడానికి ఓ కారణముంది. మిమ్మల్ని గురించి వచ్చిన ఓ సిఫారసు ఉత్తరం ఓ పెద్ద పోలీసాఫీసరు వ్రాశాడు. ఆయన మీ నాన్నగారి శిష్యుడట. 'మా గురువుగారు చాలా మంచివారు. బహుకుటుంబీకుడు. మీరీ సహాయాన్ని చెయ్యాలి' అని అర్థించాడు. విద్యార్థులకి పాఠాలు చెప్పే మీ న్నాగారు, జీవితంలో పాఠాలు నేర్చుకోలేదు!"

సంపత్‌కి కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

అధికారి సంప్‌తని కళ్ళలోకి గుచ్చి చూస్తూ అన్నాడు - "సరే, ఈ ఉద్యోగాన్ని మీకిస్తాను. కాని ఓ షరతు! వచ్చే ఆదివారం ఇదే ప్రాంగణంలో కుటుంబ నియంత్రణ శిబిరం ఏర్పాటు చేయబడ్తోంది. వేసక్టమీ ఆపరేషన్ కోసం మీ తండ్రిగార్ని, అన్నల్నీ, బావగార్నీ తీసుకురండి. వాళ్ళు నలుగురూ ఆపరేషన్ బల్ల దిగిన మరుక్షణం, ఆర్డరు మీ చేతికి స్వయంగా నేనే అందిస్తాను. ఏమంటారు?"

"అదంత సులువు..."

"కాదేమోనంటారు.! మీరు కుటుంబ సంరక్షణ సమితిలో ఉద్యోగార్థులై ఈ ఇంటర్వ్యూ కొచ్చారు. ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు కదా! ఈ ఉద్యోగం వచ్చేదీ, లేందీ మీ చేతుల్లోనే ఉంది! ఆదివారం మీ కోసం ఎదురు చూస్తుంటాను. మీరింక వెళ్ళవచ్చు"

సంపత్ లేచి నిల్చున్నాడు.

"ఇంకో మాట! ఈ రోజున మూడు ఖాళీలకు నూట యాభై మందిని ఇంటర్వ్యూ చేసి, ఎనభై తొమ్మిది సిఫారసు ఉత్తరాల ఒత్తిడిని ఎదుర్కొనే దౌర్భాగ్యస్థితి నాది! రేపు మీరే ఏదైనా ఆఫీసరు హోదాలో ఇంటర్వ్యూలు చేయడం కనక తటస్థిస్తే, మూడు ఖాళీలకి పదిహేను మందికి ఎక్కువ కాకుండా ఇంటర్వ్యూలు చెయ్యాలంటే, మీలాంటి వాళ్ళందరూ సమాజాన్ని ఈ విషయంలో చైతన్యవంతం చెయ్యాలి!"

బయట అడుగుపెట్టిన సంపత్‌ని, 'ఏమడిగారంటూ' కొందరు అభ్యర్థులు చుట్టుముట్టారు.

"నీ బాబుకి నువ్వెన్నోసంతానం?" - సంపత్‌కుమార్ ఈ ప్రశ్నను వాళ్ళకి సమాధానంగా చెప్పి, అందరూ తెల్లబోయిన మోహాలతో చూస్తుండగా, షామియానా లోంచి నడిచి, ఆవరణ దాటి, బస్‌స్టాండ్‌కి వెళ్ళాడు.

అధికారి వాగ్దానం చేసిన ఉద్యోగం సంగతి ఏమైనా సరే, వాళ్ళ నలుగుర్నీ ఆపరేషన్ శిబిరానికి తరలించే ధృఢ నిశ్చయంలో సంతాన గోపాలపురం వెళ్ళే బస్సు కోసం ఎదురు చూడసాగాడు కె. సంపత్.